# రక్తదానం మరొకరికి ప్రాణదానం

- ఒకేసారి 6,166 మంది రక్తదానం చేయడం గొప్ప విషయం
- పెద్దపల్లి పోలీసుల సేవలు అభినందనీయం
- మంత్రి కొప్పుల ఈశ్వర్ కితాబు
- పెద్దపల్లిలో మెగా రక్తదాన శిబిరం విజయవంతం
- రక్తదానం చేసిన కలెక్టర్ దంపతులు



రక్తదానం చేస్తున్న పోలీసులు



పెద్దపల్లి కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ దంపతులకు జ్ఞాపికను అందజేస్తున్న సీపీ రెమా రాజేశ్వరి, పెద్దపల్లి డీసీపీ వైభవ్ గైక్వాడ్

పెద్దపల్లిటౌన్, అక్టోబర్ 2 : రక్తదానం.. మరొకరికి ప్రాణదానం చేయడం లాంటిదని రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, మైనార్టీ, దివ్యాంగులు, వృద్ధుల శాఖల మంత్రి కొప్పుల ఈశ్వర్ సూచించారు. సోమవారం జాతిపిత మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా పెద్దపల్లి సబ్ డివిజన్ పోలీసులు 6006 మందితో రక్తదానం చేయాలనే లక్ష్యంతో జిల్లా కేంద్రంలోని ఐటీఐ కళాశాల మైదానంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రామానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ గాంధీ జయంతి రోజున మెగా రక్తదానం చేసేందుకు పోలీసులు ఏర్పాట్లు చేయడం అభినందనీయమన్నారు. ఇప్పుడిప్పుడే కృత్రిమ శరీర అవయవాలు తయారు చేస్తున్నారని, కానీ రక్తం మాత్రం తయారు చేసే పరిస్థితి లేదన్నారు. రక్తం కోసం అనేక మంది పేదలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రజల అవసరాల కోసం నిరంతరం రక్తదాన శిబిరాలు కొనసాగాలని అకాంక్షించారు. జిల్లా నలుమూల నుంచి విద్యార్థులు యువతీ యువకులు పెద్ద ఎత్తున తరలివచ్చి రక్తదానం చేయడం గొప్ప విషయమన్నారు. దేశంలో ఎక్కడా జరుగని విధంగా పెద్దపల్లిలో ఇంత పెద్ద రక్తదాన శిబిరం జరగడం జిల్లా ప్రజలకు, పోలీసులకు గర్వకారణమన్నారు. ఇంత పెద్ద కార్యక్రమానికి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కడం ఖాయమన్నారు. పెద్దపల్లి మండలం రంగాపూర్‌కు చెందిన డీఎంఆర్ మెగా బ్లడ్ డోనర్స్ ఫౌండేషన్ పెద్దపల్లి వ్యవస్థాపక అధ్యక్షుడు సముద్రాల రాజ్‌కుమార్ 90 సార్లు రక్తదానం చేయడం గొప్ప విషయమని ప్రత్యేకంగా అభినందించి, శాలువాతో సన్మానించారు. కార్యక్రమానికి ముందు కలెక్టర్ దంపతులు ముజమ్మిల్ ఖాన్-హమ్నా మరియం ఖాన్‌కు డప్పు వ్యాయిద్యాలు, మహిళల కోలాట బృందాలు, ఆటాపాటలతో ఘన స్వాగతం పలికారు. కలెక్టర్‌తో పాటు ఆయన సతీమణి రక్తదానం చేసి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. రక్తదానం చేసిన యువతీ యువకులకు సర్టిఫికెట్లు, ప్రసంసాపత్రాలు అందజేశారు. మెగా రక్తదాన శిబిరంలో దాదాపు 19 బ్లడ్ బ్యాంక్‌లు పాల్గొన్నాయి. శిబిరాన్ని విజయవంతం చేసిన యువతకు రామగుండం సీపీ రెమా రాజేశ్వరి కృతజ్ఞలు తెలిపారు. కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్, పెద్దపల్లి బల్దియా చైర్‌పర్సన్ డాక్టర్ దాసరి మమతారెడ్డి, పెద్దపల్లి-జూలపల్లి ఎంపీపీలు బండారు స్రవంతి-శ్రీనివాస్ గౌడ్, కూసుకుంట్ల రమాదేవి, డీసీపీ వైభవ్ గైక్వాడ్, ఏసీపీలు ఎడ్ల మహేశ్, తుల శ్రీనివాస్‌రావు, తిరుపతిరెడ్డి, మోహన్, సీఐలు బర్ల అనిల్‌కుమార్, జగదీశ్, సత్యనారాయణ, ఎస్ఐలు మహేందర్, శ్రీనివాస్, శ్రీధర్, రామకృష్ణ, రెడ్ క్రాస్‌సొసైటీ సభ్యులు శ్రీనివాస్‌రావు, కావేటి రాజగోపాల్ పాల్గొన్నారు.



90సార్లు రక్తదానం చేసిన సముద్రాల రాజ్‌కుమార్‌ను శాలువాతో సత్కరిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేతకాని, ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, సీపీ రెమో రాజేశ్వరి, ఏసీపీ వైభవ్ గైక్వాడ్

### అభివృద్ధికి పాటుపడుతాం



గాంధీ జయంతి రోజున పోలీసులు రక్తదానం చేయడం గొప్ప విషయం. సీఎం కేసీఆర్, ఐటీ యూత్ ఐకాన్, మంత్రి కేటీఆర్ మార్గనిదేశంలో పెద్దపల్లి జిల్లా అభివృద్ధికి పాటుపడుతాం. వారి నాయకత్వంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయి.

**- బోర్లకుంట వెంకటేశ్ నేతకాని, పెద్దపల్లి ఎంపీ**

### ప్రజలకు మరింత దగ్గరయ్యారు



ఒకే రోజున 6006 మంది రక్తదానం చేయడం కోసం పెద్దపల్లి పోలీసులు ఎన్నో రోజులు కష్టడ్డారు. ప్రతి గ్రామం నుంచి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధుల సహకారంతో యువతకు అవగాహన కల్పించి శిబిరానికి తరలించడం గొప్ప విషయం. పోలీసులు చేపట్టిన మెగా రక్తదాన శిబిరంతో వారు ప్రజలకు మరింత దగ్గరయ్యారు. పోలీసులు పెట్టుకున్న 6006 లక్ష్యాన్ని ఛేదించి 6166 మంది రక్తదానం చేసేలా కృషి చేశారు.

**- దాసరి మనోహర్‌రెడ్డి, పెద్దపల్లి ఎమ్మెల్యే**

### వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటుకు ప్రయత్నం

పెద్దపల్లి, అక్టోబర్2(నమస్తే తెలంగాణ): పెద్దపల్లి సబ్ డివిజన్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. యువతీ యువకులు, ప్రజాప్రతినిధులు, పోలీస్ అధికారులు, సిబ్బంది, ప్రభుత్వ అధికారులు, ప్రైవేట్ ఉద్యోగులు, వ్యాపారులు రక్త దానం చేసేందుకు ముందుకు వచ్చారు. కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ దంపతులు రక్తదానం చేసి యువతకు స్ఫూర్తిగా నిలిచారు. 6006 మందితో రక్తదానం చేయించాలని పెద్దపల్లి సబ్ డివిజన్ పోలీసులు అధికారులు టార్గెట్ పెట్టుకున్నారు. గత రెండు నెలలుగా గ్రౌండ్ వర్క్ చేస్తూ రక్తదానంపై ప్రజలకు అవగాహన కల్పించి, రక్తదానంపై ఉన్న అపోహను తొలిగించారు. దీంతో అనుకున్న లక్ష్యానికి మించి రికార్డు స్థాయిలో 6,166 మంది రక్తదానం చేయడంతో ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు కోసం పంపుతున్నట్లు పోలీస్ శాఖ ఉన్నతాధికారులు వెల్లడించారు. మొత్తంగా కార్యక్రమం విజయవంతం కావడంతో 'శభాష్‌పోలీస్' అని మంత్రి, ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు కితాబిచ్చారు. శాంతి భద్రతలు కాపాడటంతోపాటు సమాజ హితం కోసం ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేపట్టాలని జిల్లా ప్రజలు ఆకాంక్షించారు.

# కాంగ్రెస్ అంటేనే మోసం

- ఆరు గ్యారెంటీలు ఉత్తుత్తివే
- ఇన్నేండ్లు అధికారంలో ఉండి చేయనోళ్లు ఇప్పుడు చేస్తరా..?
- వాళ్లు అధికారంలోకి వస్తే కటికచీకట్లే
- పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్
- అడవిసోమన్‌పల్లిలో ప్రజా ఆశీర్వాద యాత్ర



మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్

మంథని/మంథని రూరల్, అక్టోబర్ 2: 'కాంగ్రెస్ అంటేనే మోసం. వారు అధికారంలోకి వచ్చే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని హామీలు ఇస్తున్నారు. అవన్నీ ఉత్తుత్తి పథకాలే. రాష్ట్రాన్ని, దేశాన్ని ఏండ్లకేండ్లు పాలించి చేయనోళ్లు.. ఇప్పుడు చేస్తరా..? మీరే ఆలోచించండి' అంటూ పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఆయన చేపట్టిన ప్రజా ఆశీర్వాద పాదయాత్ర సోమవారం అడవిసోమన్‌పల్లిలో మొదలై, నాగెపల్లి, స్వర్ణపల్లి, వెంకటాపూర్, మల్లారం, ఆరెంద, బట్టుపల్లి, ఖానాపూర్ క్రాస్, ఎక్లాసపూర్, రచ్చపల్లి, సూరయ్యపల్లి, కాకర్లపల్లి, మైదుపల్లి, గంగాపురిలో గ్రామాల్లో కొనసాగింది. ఆయా గ్రామాల్లో ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నన్ని రోజులు మనకు చీకటి రోజులే ఉన్నాయన్నారు. దేశంలో, రాష్ట్రంలో, నియోజకవర్గంలో ఎక్కువ శాతం అధికారంలో ఉండి చేసింది శూన్యమన్నారు. ఇప్పుడు అధికారంలోకి అది చేస్తాం.. ఇది చేస్తాం అంటూ ఆచరణ సాధ్యంకాని హామీలు ఇస్తున్నారని విమర్శించారు. నేనేక్కటే అడుగుతున్నా.. వాళ్ల అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఈ పథకాలు అమలు చేస్తున్నారా..? అంటూ ప్రశ్నించారు. ప్రజలను మభ్య పెట్టేందుకే ఇలాంటి హామీలు ఇస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణ పాఠం చెప్పాలన్నారు. బీఆర్ఎస్ సర్కారు వ్యవసాయానికి రంగానికి పెద్దపీట వేస్తూ 24 గంటల ఉచిత కరెంట్, పుష్కలంగా నీరందిస్తుండడంతో రైతులు సంతోషంగా రెండు పంటలు సాగు చేసుకుంటున్నారన్నారు. కానీ, వ్యవసాయానికి 24 గంటలు ఎందుకని, కేవలం 3 గంటలు చాలని స్వయంగా కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాట్లాడిన విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. వాళ్లు అధికారంలోకి వస్తే రైతులకు 24 గంటల కరెంట్ ఉండదని, దళితు బంధు, రైతు బంధు, కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాలు ఉండవన్నారు. సాగుకు 24 గంటల కరెంట్ ఇస్తున్న బీఆర్ఎస్ కావాలో.. 3 గంటల కాంగ్రెస్ కావాలో ఆలోచించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌కు అధికారం, కుర్చీలు మాత్రమే కావాలని, ప్రజా సంక్షేమం, సమస్యలు వారికి అక్కరలేదని విమర్శించారు. తాను ఎమ్మెల్యేగా పని చేసిన నాలుగున్నరేండ్లలోనే మంథని నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో తీర్చిదిద్దానని, నా తల్లి పేరిట ఏర్పాటు చేసిన పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్టు ద్వారా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశానని చెప్పారు. తాను మీ సేవకుడిని అని, వచ్చే ఎన్నికల్లో ఆశీర్వదిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కొండ శంకర్, జడ్పీటీసీ తగరం సుమలత శంకర్‌లాల్, పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ ఎక్కటి ఆనంతరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఎగోలపు శంకర్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు పుట్ట ముకేష్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

**కావలెను**

jobs Apply Now!

★ రామకృష్ణ గ్రూప్ Hyd, VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు, బేబి కేర్, ఇంటి/ వంటపని చేయుటకు వర్కర్స్ కావలెను. భో|| + వ|| + జీతం: 15-22 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్. ఫోన్: 9281452833, 9281452844.
NT-310380-All

**CHANGE OF NAME**

★ I, DESHDENI SHANKAR, S/o. Deshdeni Bheemaiah, R/o. H.No. 7-4-260, Vidya Nagar, Jagityal, TS. Changed My Name as DESHAVENI SHANKAR, S/o. Deshaveni Rajanna.
NT-318142

**NAME CHANGED**

★ Kummari Babayi D/o. Yellaiah (Before Marriage) and Adelli Babai W/o Parsharam (after marriage) H.No. 2-4-161, Ambedkarnagar, Vemulawada, Rajanna Sircilla Dist. T.S. Both Names are me.
NTK-316573

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194